క్లుప్తంగా

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



హిందీ భాషా దినోత్సవం నిర్వహిస్తున్న హెచ్ఎం మహేష్‌నారాయణ, విద్యార్థులు

పుంగనూరు: మండలంలోని గూడూరుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం హెచ్ఎం మహేష్‌నారాయణ ఆధ్వర్యంలో హిందీ భాషా వినియోగం, భాషతో ఉపయోగాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులంతా హిందీ, ఇంగ్లిష్, తెలుగు భాషలను సరళంగా మాట్లాడడం, రాయడం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిద్రమాత్రలు మింగిన వ్యక్తికి అస్వస్థత



పుంగనూరులో అస్వస్థతకు గురైన సునీల్

పుంగనూరు: ఓ వ్యక్తి నిద్రమాత్రలు మింగి అస్వస్థతకు గురైన సంఘటన పట్టణంలోని శాంతినగర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉన్న నంజేగౌడు కుమారుడు సునీల్ (31) పట్టణంలోని ఓ బేకరీలో కూలీ పనులు చేస్తుండేవాడు. ఈ క్రమంలో పనిభారం కారణంగా ఇంటికి వచ్చి అలసట తీర్చుకునేందుకు నిద్రమాత్రలు వేసుకున్నాడు. అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మదనపల్లె ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దళిత మహిళను కొట్టిన వారిని శిక్షించాలి

పలమనేరు: కర్నూలు జిల్లా కల్లుకుంటలో దళిత మహిళలను కరెంట్ స్తంభానికి అమానవీయంగా కట్టేసి కొట్టిన కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని స్థానిక మానవహక్కుల సంస్థ నిర్వాహకులు డీవీ మునిరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు స్థానిక కార్యాలయంలో కర్నూలు ఘటనపై మాట్లాడుతూ ఓ బీసీ యువతిని ఎస్సీ యువకుడు ప్రేమించాడని కక్షగట్టి యువకుడి తల్లిపై దాడి చేయడం అమానుషమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

శనేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పుంగనూరు: శని త్రయోదశిని పురస్కరించుకుని శనివారం శ్రీ శనేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ సమీపంలోని యాబై రాళ్ల మొరవలో గల శ్రీ శనేశ్వర స్వామి ఆలయం, రాగానిపల్లె రోడ్డులో గల శ్రీ శనేశ్వరస్వామి ఆలయాల్లో వేకువజామునే హోమాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, ఉత్సవ విగ్రహాలకు తైలాభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు శనేశ్వరస్వామికి నువ్వులనూనె దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు.

పేద విద్యార్థులకు అన్యాయం



ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడం వల్ల పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది. ప్రతిభ ఉన్నా విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలో ఫీజులు చెల్లించలేక వైద్యవిద్యకు దూరం కావాల్సి వస్తోంది. ప్రైవేట్‌పరం చేయడం వల్ల మెడికల్ కోర్సులు చేయాలంటే ధనవంతులకే సాధ్యం అవుతుందే తప్పా, పేద విద్యార్థులకు అందని ద్రాక్ష. ప్రభుత్వం దీనిపై మరోసారి పునరాలోచన చేసి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– డా.సుభాష్‌రాజ్, కుప్పం



సామాన్యులకు దూరమే..!



ఎంబీబీఎస్ సీట్లను పెంచి ఈడబ్ల్యూఎస్ కోటా తప్పకుండా అమలు చేయాలని నిబంధనలు చెబుతున్నాయి. దీన్ని బట్టి చూస్తుంటే రాష్ట్రంలో మెడికల్ సీట్లకు కొరత కల్పించి ప్రైవేట్ సీట్లకు భారీ డిమాండ్ వచ్చే వ్యూహంతో ప్రభుత్వం వెళ్తున్నట్టు తెలుస్తోంది. కొత్త మెడికల్ కళాశాలలో సీట్లు పెంచుకోమని ఎన్ఎంసీ చెప్పినా, వద్దంటూ ప్రభుత్వం లేఖలు రాయడం వెనుక మతలబు ఏమిటో సామాన్యులకు సైతం బాగా అర్థమైంది. ఏదేమైనా సామాన్యులకు వైద్య విద్య ఇక దూరమైనట్టే.

–సోమచంద్రారెడ్డి, జిల్లా మేధావుల ఫోరం అధ్యక్షుడు

అక్రమాల కుప్పం

- కుప్పం మున్సిపాలిటీలో యథేచ్ఛగా డీకేటీ భూమి ఆక్రమణ
- 100 ఏళ్ల నాటి కాలువను పూడ్చివేసి ప్లాట్లుగా మార్చిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు
- నిబంధనలకు విరుద్ధమని తెలిసినా పట్టించుకోని అధికారులు
- మున్సిపాలిటీ అనుమతుల కోసం అధికార పార్టీ నేతలకు భారీగా నగదు చేతులు మారినట్లు సమాచారం
- విషయం బయటకు పొక్కడంతో తర్జనభర్జన పడుతున్న నేతలు

కుప్పం మున్సిపాలిటీ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అడ్డదిడ్డంగా వ్యాపారం చేస్తూ కాసులు వెనుకేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కుప్పం మున్సిపాలిటీలో డీకేటీ భూముల ఆక్రమణ, ఆపై అందులోనే వెంచర్లు వెలుస్తున్నాయి. తాజాగా మున్సిపాలిటీ పరిధిలో వర్షపు నీటి ప్రవాహం కోసం వందేళ్ల కిందట తవ్విన నీటి కాలువలను యథేచ్ఛగా పూడ్చి వేసి ప్లాట్లుగా మార్చేశారు. అధికార పార్టీ నేతలకు అనుకూలంగా ఉండే కొందరు వ్యాపారులు మున్సిపాలిటీ నిబంధనలను పాటించకుండా పాట్లు వేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో కుప్పంలో మూడు అక్రమాలు.. ఆరు అన్యాయాలు అన్నట్లు రియల్ ఎస్టేట్ వ్యాపారులు దందా సాగిస్తున్నారు.



కమతమూరులో వేసిన లేఅవుట్



చింతచెట్లును మాయం చేసి ప్లాట్లుగా మార్చేసిన వైనం

కుప్పం: మున్సిపాలిటీ పరిధిలోని కమతమూరు రోడ్డులో సర్వే నంబర్లు 97–2లో 1.68 ఎకరాలు, 105లో 2.19 ఎకరాల విస్తీర్ణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ వేశారు. ఇందులో ప్లాట్లకు పడమర దిక్కున్న ఉన్న కుప్పం చెరువు నుంచి కమతమూరు చెరువు వరకు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కాలువను ఆక్రమించారు. సుమారు 3 కిలోమీటర్ల మేర కాలువను పూడ్చివేసి ప్లాట్‌లు వేశారు. భవిష్యత్తులో వర్షాలు కురిసి కుప్పం చెరువు నిండి ప్రవహిస్తే మాత్రం పెనుముప్పు తప్పదు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల దెబ్బకు కాలువ ఆనవాళ్లు కనుమరుగమయ్యాయి.

డీకేటీలు ఆక్రమించుకుని..

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రాజ్‌కాలువ పక్కనే 0.15 విస్తీర్ణంలో డీకేటీ స్థలం ఉంది. అంతేకాకుండా ఈ విస్తీర్ణంలో చింతచెట్లు పెంపు కోసం ప్రభుత్వం టూ సీ పట్టాలను స్థలం అనుభవదారులకు 50 ఏళ్ల కిందట ఇచ్చింది. రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు వీటిని లెక్క చేయలేదు. కాలువ ఆనవాళ్లు లేకుండా చేయడంతో పాటు డీకేటీ స్థలం, చింతచెట్లు నరికేసి వెంచర్ వేశారు. దీనికి తోడు ప్రభుత్వ నింబంధలను పాటించక ఇష్టానుసారంగా ప్లాట్‌లు వేశారు. రోడ్డు విస్తీర్ణం, ప్రజా అవసరాల కోసం 10 శాతం స్థలం కేటాయింపు, మురుగునీటి కాలువలు, విద్యుత్ సౌకర్యం కల్పించకుండా ఇష్టానుసారంగా రియల్ ఎస్టేట్ కుప్పం జోరుగా సాగుతుంది.

లక్షల్లో చేతుల మారిన వైనం..

మున్సిపాలిటీ పరిధిలోని ఈ స్థలం అత్యంత విలువైంది. 0.15 సెంట్లు ప్రభుత్వ భూమి, కాలువ, టూసీ పట్టాలపై చర్యలు తీసుకోకుండా అధికార పార్టీ నేతలు లక్షలు చేతులు మారినట్లు సమాచారం. దీంతో పాటు మున్సిపాలిటీ అనుమతులు ఇప్పించాలని నియోజకవర్గంలోని ప్రధాన నేతలకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు లక్షల్లో నగదు ముట్టజెప్పినట్లు పట్టణంలో హాట్‌టాపిక్ అయింది. ఈ విషయం గతవారం రోజులుగా కుప్పం సర్కిళ్లలో బహిరంగంగానే చర్చ జరుగుతోంది. దీంతో అధికార పార్టీ నేతలు తర్జనభర్జన పడుతున్నారు.

విద్యార్థిని ఢీకొన్న బస్సు

పుంగనూరు: ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ విద్యార్థిని బస్సు ఢీకొన్న సంఘటన పట్టణంలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద శనివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. పట్టణ సమీపంలోని హనుమంతరాయుని దిన్నెకు చెందిన అమరనాథ్ కుమారుడు నవీన్‌కుమార్(17) మదనపల్లెలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడు. ఈ క్రమంలో కళాశాలకు వెళ్లేందుకు మదనపల్లె మార్గంలోని అమరనాథ్ పెట్రోల్ బంక్ వద్దకు రాగా వెనుక నుంచి ఓ ప్రైవేటు బస్సు ఢీకొనడంతో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బేలుపల్లెలో వైద్యశిబిరం



వైద్యసేవలందిస్తున్న ఆరోగ్యసిబ్బంది

బైరెడ్డిపల్లె: మండలంలోని బేలుపల్లెలో అతిసారా విజృంభించడంతో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన రమణ, రామచంద్ర, రత్నప్ప, మునెమ్మ ఆదెలక్ష్మి తదితరులు అతిసారా తీవ్రతతో పలమనేరు, కుప్పం పీఈఎస్, చిత్తూరు ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. కలుషిత నీరు కారణంగా అతిసారా విజృంభించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



బైరెడ్డిపల్లె ఎస్సీ కాలనీలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు

వినాయక.. సెలవిక

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని శనివారం నిమజ్జనానికి తరలించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టి ట్రాక్టర్‌లో కొలువుదీర్చి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. బాణసంచాలు పేల్చుతూ, యువకులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు.

దళితులను కొట్టిన వారిపై చర్యలు తీసుకోండి

పుంగనూరు: నెల్లూరు జిల్లా ముత్తుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో దళిత యువకులను కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఆర్.అశోక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండు వర్గాల ఘర్షణలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన దళితులను రాత్రంతా పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించి, చితకబాది, కులం పేరుతో దూషించిన ఎస్ఐ విశ్వనాథ్, హెడ్‌కానిస్టేబుల్ సుమన్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. వారిపై తక్షణం ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలన్నారు. దీనిపై తక్షణం ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగరాజ, భాస్కర్, రెడ్డెప్ప పాల్గొన్నారు.

గ్రంథాలయాల వినియోగం పెరగాలి



మాట్లాడుతున్న తులసీనాథం నాయుడు

పలమనేరు: గ్రంథాలయాల వినియోగం పెరిగినప్పుడు విజ్ఞాన దాయక సమాజం ఏర్పడుతుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు తెలిపారు. గ్రంథాలయ ఉద్యమ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతిని స్థానిక కళామందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో పుస్తకపఠనం బాగా తగ్గిందన్నారు. ఫలితంగా సమాజంలో విలువలు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రచయితగా, సంపాదకులుగా గాడిచర్ల సేవలు మరువలేనివన్నారు. ఎడిటర్ అనే ఆంగ్ల పదానికి సంపాదకుడు అనే తెలుగు పదాన్ని కనిపెట్టింది ఆయనేనన్నారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి పుష్ప, ఆనందబాబు, గుణశేఖర్, దేవనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



పుంగనూరులో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

పుంగనూరు: పట్టణంలోని బెస్తవీధిలో ఉన్న గజానన సేవా సంఘం వారు శనివారం గణనాథుడికి విశేష పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వామివారికి వేదపండితులు పూజాకైంకర్యాలు చేపట్టి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గణనాథుడి ప్రతిమలను కొలువుదీర్చి భక్తి శ్రద్ధలతో కొలుస్తున్నారు. అందులో భాగంగా బెస్తవీధికి చెందిన గజానన సేవా సంఘం వారు స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు శ్రీనివాసులు, సుబ్బయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

16న లడ్డూ వేలం పాట..

పట్టణంలోని బెస్తవీధిలో ఏర్పాటు చేసిన శ్రీవినాయకస్వామి మండపం వద్ద ఈనెల 16న లడ్డూను వేలంపాట నిర్వహిస్తున్నట్లు గజానన సేవా సంఘం సభ్యులు తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని వేలంలో పాల్గొని దక్కించుకోవచ్చన్నారు.

ఆర్భాటాల వేదిక..

- ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరణలో అధికారుల పోటాపోటీ
- సమస్యల పరిష్కారంలో మాత్రం చర్యలు శూన్యం
- వారానికి ఒకసారి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, కడా పీడీ
- తాజాగా కుప్పంలో వార్డుబాట పేరిట మున్సిపల్ కమిషనర్ హంగామా



కుప్పం మున్సిపాలిటీలో ఫిర్యాదులు ఇవ్వడానికి వచ్చిన అర్జీదారులు

కుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో అధికారుల ఆర్భాటాలు ప్రజలకు విసుగు తెప్పిస్తున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన గత మూడు నెలల నుంచి ప్రజల సమస్యల పరిష్కారానికి ''ప్రజాసమస్యల పరిష్కార వేదిక'' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్, కడా పీడీ ప్రజల నుంచి ఇప్పటికే ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఇప్పుడు అదే బాటలో కుప్పం మున్సిపల్ కమిషనర్ వార్డుబాట పేరిట ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ చేపట్టిన ఫిర్యాదుల స్వీకరణకు ప్రజల నుంచి వేలల్లో అర్జీలు వస్తుంటే, కడా పీడీకి కూడా వందల్లో ఫిర్యాదులు వస్తున్నాయి. ఇవి కాదని ఇప్పుడు వారం రోజులుగా మున్సిపాలిటీ పరిధిలోని ప్రతివార్డులో అధికారులు, అధికార పార్టీ నేతలు పర్యటిస్తూ, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే కార్యక్రమం చేపట్టారు. ఫిర్యాదులు లెక్కకు మించి ప్రజల నుంచి వచ్చినా, సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఎంతసేపూ అధికారులు, అధికార పార్టీ నేతల హంగూ, ఆర్భాటాలు తప్పా. జిల్లా కలెక్టర్ ఓ వైపు..కడా పీడీ మరో వైపు సమస్యలు లేని కుప్పంగా మార్చాలని చెబుతున్నారు. కుప్పం మున్సిపాలిటీలో కమిషనర్ సైతం పరిష్కార వేదిక కార్యక్రమాలు చేపట్టడం పలు విమర్శలకు దారి తీస్తోంది. ఎవరు ఎన్ని పరిష్కార వేదికలు నిర్వహించినా కుప్పం నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. మూడు నెలలుగా కుప్పం అభివృద్ధి అంతా ప్రణాళికలు.. ఫిర్యాదుల స్వీకరణతోనే సాగుతోంది తప్పా అభివృద్ధి కార్యక్రమాల ఆరంభం మాత్రం కనబడడం లేదు.

సమస్యల పరిష్కారానికే లోక్ అదాలత్



జూనియర్ సివిల్ కోర్టులో లోక్అదాలత్ జరుగుతున్న దృశ్యం



కక్షిదారులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు,



మాట్లాడుతున్న న్యాయమూర్తులు శిరీష్, ఉమాదేవి

- లోక్ అదాలత్‌లో 143 కేసులు పరిష్కారం
- రూ.97.07 లక్షల విలువైన కేసుల రాజీ

పలమనేరు: పట్టణంలోని సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో సీనియర్ సివిల్‌జడ్జి శ్రీనివాసరావు, జూనియర్ సివిల్‌జడ్జిలు లిఖిత, రాధమ్మ ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాతీయ లోక్అదాలత్‌లో 143 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో సివిల్, క్రిమినల్, బ్యాంకులకు సంబంధించి మొత్తం రూ.97.07 లక్షల విలువైన కేసులను రాజీ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ జడ్జి శ్రీనివాసరావు మాట్లాడతూ కక్షిదారులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్ ద్వారా సులభంగా కేసులను రాజీ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇరుపార్టీల వారు అనవసర పంతాలకు పోయి సమయాన్ని, నగదును వృథా చేసుకోవద్దని సూచించారు. రాజీమార్గం ద్వారా కక్షిదారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సుప్రీం కోర్టు ఈ విధానాన్ని అమలు చేస్తోందన్నారు. ఇందులో రాజీ పడిన వారు కేసులు గెలిచినట్టేనని తెలిపారు. కేసుల రాజీకి కృషిచేసిన న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులు, పోలీసులకు ఆయన అభినందనలు తెలిపారు. ఇందులో వివిధ స్టేషన్ల నుంచి పోలీసులు, సీనియర్ లాయర్లు లక్ష్మీపతి, పరమశివప్ప, భాస్కర్, ఏపీపీ రంజిత్‌షాతో పాటు బార్ అసోషియేషన్ సభ్యులు, పలు బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణంలో జాతీయ లోక్అదాలత్ 63 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్‌జడ్జి శిరీష్ తెలిపారు. శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఉమాదేవితో కలసి సివిల్ 6, క్రిమినల్ 57 కేసులు పరిష్కరించారు. ఇందులో కక్షిదారులకు రూ.21.50 లక్షలు ఇప్పించినట్లు తెలిపారు. కేసులు సత్వరం పరిష్కరించుకునేందుకు ప్రతి ఒక్కరూ లోక్ అదాలత్‌ను వేదిక చేసుకోవాలని న్యాయమూర్తి కోరారు. సమావేశంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు న్యాయవాదులు, పోలీసులు, అధికారులు పాల్గొన్నారు.

గణనాథా.. వరుణదేవుడికి చెప్పవా..!

- చుక్కనీరు లేని వాగులు, చెరువులు
- నిమజ్జనానికి నీళ్లు కరువు
- ఆకాశం కేసి చూస్తున్న గణనాథుడు

బైరెడ్డిపల్లె: వాగులు..వంకలు.. కుంటలు.. చెరువుల్లో ఎక్కడా చుక్కనీరు లేక ఎటుచూసినా బీడు భూములే దర్శనమిస్తున్నాయి. ఈ తరుణంలో ఇటీవల వినాయక చవితి సందర్భంగా వినాయక ప్రతిమలను మండలవ్యాప్తంగా కొలువుదీర్చారు. అయితే 5వ రోజు, 9వ రోజు గణనాథుడి ప్రతిమలను నిమజ్జనం చేయాలంటే ఎక్కడా నీరు లేక దిక్కుతోచని స్థితి నెలకొంది. కొంతమంది యువకులు చెరువుల్లో అక్కడక్కడ ఉన్న కొంత నీటిలోనే నిమజ్జనం చేస్తున్నారు. గత ఐదేళ్లుగా చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండడంతో వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఆటంకం ఎదురవలేదు. ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో పంటలు సైతం ఎండుముఖం పడుతున్నాయి. మండలంలోని కై గల్, దేవదొడ్డి సమీపంలో ఉన్న చెరువులో చుక్కనీరు లేకపోవడంతో యువకులు కరుణించు స్వామి అంటూ వినాయక విగ్రహాన్ని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. చెరువులో మండుటెండలో ఉన్న వినాయక విగ్రహాలను చూసిన ప్రజలు దేవుడే తమ బాధను అర్థం చేసుకోవాలని కోరుతున్నారు. పలమనేరు–కుప్పం జాతీయ రహదారికి ఆనుకునే కైగల్ చెరువు ఉండడంతో రహదారిలో వెళ్లే ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుణ దేవుడు కరుణించకపోతే బోరుబావులు కూడా ఎండిపోయే పరిస్థితి తలెత్తుతోంది.



బైరెడ్డిపల్లె: దేవదొడ్డి చెరువులో నీరు లేక అలాగే నిమజ్జనం కాక అలాగే ఉన్న గణనాథుడి ప్రతిమ



కైగల్ సమీపంలోని నీరులేని చెరువులో వినాయక విగ్రహానికి పూజలు చేసి వదలి వెళ్లిన యువకులు



బైరెడ్డిపల్లె పెద్ద చెరువులో అరకొర నీటిలో వినాయక ప్రతిమల నిమజ్జనం



బైరెడ్డిపల్లె: పెద్దపురం చెరువులో నీరు లేక గణపతి